## రూ. 1.75లక్షల ఎల్ఓసి అందించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జగన్నాథపల్లి గ్రామానికి చెందిన దేడావత్ వినోదకు ఆరోగ్య చికిత్స నిమిత్తం రూ.1 లక్ష 75 వేల విలువైన ఎల్ఓసిని పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి అందజేశారు.ఈ ఎల్ఓసీ పత్రాన్ని వినోద కుమారుడు ఉదయ్ కిరణ్ కు ఎమ్మెల్యే అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు అవసరమైన వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 13 మార్చి, 2026 | పేజీలు : 06


# పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** యుద్ధం కారణంగా పెరుగుతున్న గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ సీనియర్ నాయకులు ఆది సాయన్న, పాతూరు సుగుణమ్మ అన్నారు. గురువారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పెరిగిన గ్యాస్, నిత్యావసర ధరల గురించి ధర్నా నిర్వహించడం జరిగింది. యుద్ధం కారణంగా గ్యాస్ ధరలను తగ్గించాలని వంట గ్యాస్ ప్రజలకు అందుబాటులో ఉంచాలని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సుమారు వందమంది మహిళలతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉదృతం చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్పోరేట్ కంపెనీలకే బీజేపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, గ్యాస్ధరలను తగ్గించకపోతే పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెంటనే ధరలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆకుల శ్రీనివాస్, జనగామ టౌన్ కార్యదర్శి సొప్పరి సోమయ్య, పండుగ నిర్మల, యాదలక్ష్మి, గుగులోతు సఖి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



### లిఫ్ట్ ప్రమాదంలో
# జర్నలిస్టులకు గాయాలు



పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర,జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాల్లో గురువారం లిఫ్ట్ వైర్ తెగిపడి జరిగిన ప్రమాదంలో జిల్లా జర్నలిస్టులకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మీడియా ప్రతినిధులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి అవసరమైన అన్ని విధాల వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పెద్ద పెద్ద భవనాలలో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు ఫైర్, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర తనిఖీలు చేపడతామని తెలిపారు. భవనాల నాణ్యత, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పెద్ద భవనాలకు నిబంధనల మేరకు తప్పనిసరిగా పార్కింగ్ సౌకర్యం ఉండాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఆర్ఎంఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

### జోయాలుక్కాస్ షోరూంను
# ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం /హనుమకొండ :** హనుమకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫేవరెట్ జ్యువెలర్ జోయాలుక్కాస్ ను రాష్ట్ర అటవీ, పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వరుసగా మూడు రోజుల్లో నాలుగు కొత్త షోరూమ్ల ప్రారంభోత్సవాన్ని చేపట్టినట్లు, ఇది భారత దేశంలో వారి విస్తరణలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. కొత్తగా ప్రారంభించే వాటిలో వరంగల్లో రెండవ షో రూమ్ ను గురువారం ప్రారంభించినట్లు తెలిపారు.ఈ వేగవంతమైన విస్తరణ ప్రాంతంలో పెరుగుతున్న కస్టమర్ డిమాండ్ను అందుకోవడానికి జోయాలుక్కాస్ ప్రత్యేకమైన రిటైల్ భావనకు అనుగుణంగా, కొత్తగా ప్రారంభించిన ప్రతి షోరూమ్ను ఆధునిక ఇంటీరియర్లు, విశాలమైన లేఅవుట్లు, అత్యుత్తమ సౌకర్యాలతో వినియోగదారులకు సులభమైన, సౌకర్యవంతమైన షాపింగ్ అనుభూతిని అందించేలా రూపొందించినట్లు తెలిపారు. వినియోగదారులు ఒకే చోట బంగారం, వజ్రాలు, విలువైన రాళ్ళు, ప్లాటినం, వివాహ ఆభరణాల విస్తృత శ్రేణిని చూడవచ్చని, వ్యక్తీకరించిన సేవల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఈ బ్రాండ్ గుర్తింపు పొందిందని ఈ సందర్భాన్ని పురస్కరించుకుని,ఈ క్రమంలో జోయాలుక్కాస్ మార్చి 29 వరకు మాత్రమే, తయారీ ఛార్జీలపై ఫ్లాట్ 40 శాతం తగ్గింపుతో ఒక పరిమిత కాలపు ప్రారంభ ఆఫర్ను అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ కొత్త ప్రారంభోత్సవాల గురించి ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో 3 రోజుల్లో నాలుగు కొత్త షోరూమ్లను ప్రారంభించడం ద్వారా తమ ఉనికిని మరింత బలోపేతం చేయడానికి తాము సంతోషిస్తున్నామన్నారు. తమ వినియోగదారుల నిరంతర విశ్వాసం, ఆదరణ తమ వృద్ధికి చోదక శక్తిగా ఉన్నాయని, ప్రతి షోరూమ్ను అత్యుత్తమ నాణ్యత, వినూత్న డిజైన్లు మరియు శ్రద్ధగల సేవ కలయికతో ప్రపంచ స్థాయి నగల కొనుగోలు అనుభవాన్ని అందించడానికి జాగ్రత్తగా రూపొందించబడిందన్నారు. ఈ కొత్త చేర్పులతో, జోయాలుక్కాస్ తన అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నగల అనుభవాన్ని ముఖ్యమైన మార్కెట్లలోని వినియోగదారులకు మరింత చేరువ చేస్తూ, ఈ ప్రాంతంలో అత్యంత విశ్వసనీయమైన నగల వ్యాపారులలో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు, రాకేష్ రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సినీ తారలు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పదవతరగతి విద్యార్థులకు ప్రమోదన్న పరీక్ష సామాగ్రి కానుక

**ప్రజాపక్షం/వేలేరు :** పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు భయపకుండా కష్టపడి చదివి ఇష్టంతో పరీక్షలు రాసి ఉన్నత ర్యాంకులు సాధించి పాఠశాలకు,గ్రామానికి,కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘునాయకుల శ్రీధర్‌రెడ్డి సందేశం పంపించారు.గురువారం వేలేరు మండలం పీచర గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఆద్వర్యంలో గురువారం ప్రమోద్‌రెడ్డి అనుచరవర్గం పరీక్ష సామాగ్రిని పంపిణీచేశారు, ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లి, దండ్రులతో పాటు ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు పరీక్షల సమయంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద వహించాలని, నేటి ఆధునిక సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పోటీ తత్వంతో కూడుకున్న సమయంలో ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పోటీపరీక్షలలో ఉత్తీర్ణులై ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు దయాకర్, ఇస్మాయేల్, గ్రామస్తులు ఏలూరి కరుణాకర్, దామెర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/మంగపేట :** మండలంలోని మంగపేట ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి పొదేం మేనక సమక్షంలో పదవ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జవంగుల రవీందర్, తండ్రి చంద్రశేఖర్, జ్ఞాపకార్థం హబీబ్ మెడికల్ షాప్ యజమాని గఫార్ ఖాన్ మంచి మనస్సుతో ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు కాంపాస్ బాక్స్ లు ఎరేజర్లు స్కేల్‌లను పదవ తరగతి విద్యార్థులకు అందజేశారు. పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఈ విద్యాసామగ్రి ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖ అధికారి పొదేం మేనక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతి నాగేందర్, వెంకటేశ్వర్లు, మాధురి, దేవి, వెంకటేశ్వర్ రెడ్డి, సతీష్, అనంతరావు, అనసూయ, సునీత, చంద్రశేఖర్, రాజు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలంలోని 14 మార్చి 2026 నుంచి ఎస్ఎస్‌సి పబ్లిక్ ఎగ్జామినేషన్ 202526 సంవత్సరానికి జడ్పిహెచ్ఎస్ రాజుపేట సెంటర్ నందు 97 మంది విద్యార్థులు జడ్పీహెచ్ఎస్ మంగపేటకు 133 మంది అదే విధంగా జడ్పీహెచ్ఎస్ కమలాపురం సెంటర్ కు 150 మంది విద్యార్థులు మొత్తంగా 280 మంది విద్యార్థులు మన మంగపేట మండలంలోని అన్ని పాఠశాలలో కలుపుకొని పబ్లిక్ ఎగ్జామ్ రాయబోతున్నారు. వారందరికీ మండల విద్యాశాఖ పక్షాన ఆల్ ద బెస్ట్ తెలియజేస్తూ ఈ ఎగ్జామ్స్ సెంటర్లో ప్రతి రూములో వెలుతురు గాలి త్రాగునీరు విద్యార్థులకు మూత్రశాలలు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరిగినది. ఎగ్జామ్ హాల్ లో విద్యార్థులకు అందుబాటులో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు ఎగ్జామ్స్ సెంటర్ జరుగు పరిసర ప్రాంతంలో 144 సెక్షన్ కూడా ఉంటుందని ఎగ్జామ్స్ సెంటర్ కు విద్యార్థులు 8:30 వరకు హాజరుకావాలని మండల విద్యాశాఖ అధికారిని పొడెం మేనక ఒక ప్రకటనలో తెలియజేశారు.

## అధ్వానంగా హనుమకొండ విద్యుత్ నగర్ పారిశుధ్యం



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** హనుమకొండలోని విద్యుత్ నగర్ – తెలంగాణ జంక్షన్ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలలో గత 10 రోజులుగా పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించే పరిస్థితి లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారి వెంట, మురికి కాలువలలో పేరుకుపోయిన చెత్త కారణంగా పరిసర ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రత్యేకంగా 49వ డివిజన్ పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో మున్సిపాలిటీ సిబ్బంది ఇప్పటివరకు వచ్చి శుభ్రపరిచిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కన వేయబడిన చెత్త గుట్టలు రోజురోజుకు పెరుగుతూ ఉండడంతో దుర్వాసన భరించలేని స్థాయికి చేరిందని, దీంతో స్థానికులకు రాకపోకలు కూడా ఇబ్బందిగా మారినట్లు తెలిపారు.ప్రాంత ప్రజలు మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన లభించలేదని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యం చేయబడుతోందని, కనీసం రోజువారీగా చెత్త సేకరణ కూడా జరగడం లేదని పేర్కొన్నారు.ఇక్కడ పనిచేసే జవాన్లు, సఫాయి కార్మికులు పండుగల సందర్భాలలో మాత్రమే కనిపిస్తారని, సాధారణ రోజుల్లో మాత్రం పారిశుధ్య పనులు జరుగుతున్నట్లు ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. సంవత్సరానికి ఒక్కసారి కూడా చీపురు పట్టి శుభ్రం చేసిన పరిస్థితి కనిపించడం లేదని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికైనా మున్సిపాలిటీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యుత్ నగర్ – తెలంగాణ జంక్షన్ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి




**ప్రజాపక్షం/హనుమకొండ :** రామ్ నగర్ లోని సిపిఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో గురువారం సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం ఎం.చుక్కయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభం కాబోతున్న సందర్భంగా ఉద్యోగాలను తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగులకు, కాజీపేట పరిసర ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల పిల్లలకు, రైల్వే ఆక్ట్ అప్రెంటిష్ పూర్తిచేసిన నిరుద్యోగ యువతి యువకులకు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. అదే విధంగా అయోధ్యాపురంలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు, ఆ గ్రామ ప్రజలకు ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభాకర్ రెడ్డి కోరారు.పంజాబ్ లోని కపూర్తలలో, ఉత్తర ప్రదేశ్ లోని రాయబరేలిలో మరియు మహారాష్ట్రలోని లాతూర్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తదితర రైల్వే పరిశ్రమలను స్థాపించిన సందర్భంలో ఆ ప్రాంత వాసులకే (స్థానికులకు) ప్రత్యేక రిజర్వేషన్ చేపట్టి ఉద్యోగ నియమకాలు చేసారు. అలాగే వీటి సాధన కోసం మార్చి 15 న జరిగే రైల్వే జేఏసీ మహా నిరసన దీక్షకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతూ, ప్రత్యక్షంగా పాల్గొంటుందన్నారు. ఈ దీక్ష జయప్రదానికి జిల్లా లోని ప్రజాసంఘాలు, మేధావులు, నిరుద్యోగ యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జి.ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల చక్రపాణి, రాగుల రమేష్ లు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ఆశన్న



**ప్రజాపక్ష/వెంకటాపూర్ :** మండలంలోని పాలంపేట గ్రామంలో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఆశన్న అలియాస్ తక్కల్లపల్లి వాసుదేవరావు రామలింగేశ్వర స్వామిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉమాశంకర్ ఆయనకి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించారు. వారి వెంట వీరమల్ల శ్రీనివాస్ రావు, వకుళాభరణం శ్రీనివాస్, జనగాం నాగరాజు, జూపాక రమేష్, అంజి, టూరిస్ట్ పోలీసులు తదితరులు ఉన్నారు.

## డిహెచ్‌పిఎస్ జిల్లా రెండో మహాసభ



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని, ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, మండల ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్రం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు గడిచిన నేటికీ దళితులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి, కుల నిర్మూలన అన్నియు కాగితాలకే పరిమితమైపోయాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత, బలహీన వర్గాల హక్కుల కొరకు, అభివృద్ధికి రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు పాలకులు నీరుగారుస్తావున్నారు అని, బ్యాక్లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు ఆమోదయోగ్యంగా లేదు, 2025/2026 మధ్య ఆర్థిక సంవత్సరాల్లో జనాభా దామాషా ఆధారంగా జరిగిన మొత్తం కేటాయింపుల్లో కేవలం 20 శాతం జనాభా కలిగిన దళితులకు 16 శాతమే బడ్జెట్లో కేటాయింపులు జరిగాయి, ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో దళితులకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ని మరింత బలోపేతం చేయాలని, ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రేబిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కొట్టపాక రవి, ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి శనిగరపు రాజకుమార్, ఆరెపల్లి చంద్రమౌళి, ఎర్ర ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు రూ. 2 లక్షల కంప్యూటర్ ఫర్నీచర్ అందజేత



**ప్రజాపక్షం/కమలాపూర్:** మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన ఈయుటి టెక్నాలజీ అధినేత కాందుర్ల బాబురావు కుమారులైన శివాజీ, అరుణ్ జీలు దేశరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తు కోసం రూ. రెండు లక్షల విలువ గల కంప్యూటర్ ఫర్నిచర్ ను అందించి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ... పిల్లల భవిష్యత్తు కోసం సహాయం చేయడంలో ఆత్మకు సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన స్థానం పొందేందుకు చిన్నతనం నుంచి కంప్యూటర్ పై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మిట్టపల్లి మహేశ్వరి కుమారస్వామి, వార్డు మెంబర్లు, స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి, అమ్మ పాఠశాల చైర్మన్ అస్లాంబి, ఉపాధ్యాయ బృందం రాజేందర్ రెడ్డి, అజిత్ కుమార్, ఐలేష్, విజయశ్రీ, మార్విన్ వీడియోస్ నటులు పసరగొండ రత్నాకర్, స్వాగత్, బాబు రావును శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## మహిళా కార్మికులకు మొబైల్ వైద్య శిబిరం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి నెలలో నిర్వహిస్తున్న మహిళా మాసోత్సవం సందర్భంగా మున్సిపల్ మహిళా కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం హనుమకొండ సాయి బాబా మందిరంలో బిర్లా ఫౌండేషన్, కేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మొబైల్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మహిళా వర్కర్లకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్మికుల ఈ సందర్భంగా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ మహిళా కార్మికులు పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారని, సమాజానికి వారు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని అన్నారు. ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్న వారు తమ ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మరింత మంచి సేవ అందించగలరని ఆయన పేర్కొన్నారు.బాబా మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిరంతరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు మాత్రమే కాకుండా సమాజంలోని వివిధ వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తరచూ ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు.

## 10 తరగతి విద్యార్థులకు వీడ్కోలు

**ప్రజాక్షం/వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని జడ్‌పిఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదివే విద్యార్థులకు వీడుకోలు సమావేశాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసంధర్భంగా ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య మాట్లాడుతూ 10తరగతిలో విద్యార్థినీ,విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణ సాధించి పాఠశాలకు,మీకన్నతల్లిదండ్రులకు, మీసొంతగ్రామానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావడమేకాకుండా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, ఉపాధ్యాయులు ఉమాదేవి, రవి, జ్ఞానేశ్వర్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాంపుల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని పలుకాలనీలలోని సైడ్ డ్రైనేజిల కాలువలపైన్న ఉన్న ర్యాంపులు శిధిలమవడంతో ప్రయాణీకుల రవాణకు ఇబ్బందిగా మారగా వాటి స్థానంలో పున:నిర్మాణం కోసం గురువారం గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి గ్రామపంచాయితీ నిధులు మంజూరు చేసి పున:నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి, ఉరపసర్పంచ్ కోడూరి శ్రీకర్,గ్రామపంచాయితీ కార్యదర్శి రవి కుమార్, వార్డు సభ్యులు సంధ్య, ప్రవళిక, మౌనిక, సంధ్య, సునీల్, స్థానిక పోస్ట్ అధికారి నవ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** కాంగ్రెస్ మండల అధ్యక్షులు వగలబోయిన యాదగిరిగౌడ్ ఆద్వర్యంలో గ్రామశాఖ అధ్యక్షులు పండుగ కనకయ్య అధ్యక్షతన మండల కేంద్రంలోని జగ్గయ్యపేట, ఎన్నానాయక్ తండాలో ఇందిరమ్మ ఇండ్లను జనగామ నియోజకవర్గ ఇంచార్జి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ గంగం నరసింహారెడ్డి, శివకుమార్, సీనియర్ నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, సర్పంచ్‌లు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకకు హాజరైన కుంజ సూర్య

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గుర్రేవుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్కాకుల రామారావు, కూతురు వివాహానికి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క తనయుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్య, ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి. అప్సర్ పాషా, యూత్ మండల అధ్యక్షులు బోట నాగేష్, మైనార్టీ మండల అధ్యక్షులు యాకుబ్ పాషా, ములుగు షోషల్ మీడియా కోకన్వీనర్ ఎస్ సాంబశివ, ములుగు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ప పగిడయ్య, గుర్రేవుల ఉప సర్పంచ్ మంగళరావు సత్యం, ఆత్మ డైరెక్టర్ మాదాసు రాజేందర్, ఉప సర్పంచ్ నాగార్జున్, యూత్ నాయకులు, పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** రాజన్నపేట గ్రామానికి చెందిన యానకా శ్రీను ఇటీవల గత కొద్ది రోజుల క్రితం మృతి చెందగా గురువారం పెద్ద కర్మ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించిన రాష్ట్ర మంత్రి సీతక్క తనయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంజా సూర్య, ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అప్సర్ పాషా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండల కేంద్రానికి చెందిన కోనేటి నాగమణి యాకయ్య దంపతుల కుమార్తె యమున గణేష్‌రెడ్డిల వివాహం సూర్యపేట జిల్లా దండు మైసమ్మ ఎస్వీ గార్డెన్స్‌లో జరుగగా ఆ వివాహ వేడుకకు గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట వార్డు మెంబర్ శ్రీనివాస్, బిక్షపతి, చారి, యాకస్వామి, శేఖర్, మహేష్, సురేష్, అఖిల్‌రెడ్డి, తదితరులున్నారు.

## మహిళా న్యాయవాదులకు 30 శాతం రిజర్వేషన్




**ప్రజాపక్షం/వరంగల్ లీగల్ :** సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్ అధ్యక్షతన బుధవారం కోర్టు హాల్ లో జరిగిన వరంగల్ బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో మహిళా న్యాయవాదులకు 30 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఐదు పదవులను మహిళలకు కేటాయించినట్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ కమిటీ తీసుకున్న నిర్ణయాలను సర్వసభ్య సభ ముందుకు తీసుకువచ్చారు. సభ్యుల చర్చల అనంతరం సర్వత్రిక సభ పలు తీర్మానాలను ఆమోదించింది.మహిళ న్యాయవాదులకు ఉపాధ్యక్షురాలు, కోశాధికారి పదవులను ఈసారి కొత్తగా ఇవ్వడంతో పాటు గతంలో ఉన్న సంయుక్త కార్యదర్శి, సీనియర్ కార్యవర్గ సభ్యురాలు, జూనియర్ కార్యవర్గ సభ్యురాలు మొత్తం కలిపి ఐదు పదవులను మహిళలకు కేటాయించినట్లు అధ్యక్షులు వలస సుధీర్ తెలిపారు. మహిళా పదవులతో కలిపి మొత్తం 16 పోస్టులకు వరంగల్ బార్ అసోసియేషన్ ఈ నెల చివరిలో ఎన్నికలు నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వలుస సుధీర్ మాట్లాడుతూ మహిళలు బలహీనులు కాదని, వారికి అవకాశం కల్పిస్తే అసాధ్యాన్ని కూడా సాధ్యం చేస్తారని అన్నారు.మహిళా న్యాయవాదులకు రిజర్వేషన్లు కల్పించడం పట్ల పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దండాపంతుల రమాకాంత్, ఉపాధ్యక్షులు మైదం జయపాల్, సంయుక్త కార్యదర్శులు ముసిపట్ల శ్రీధర్ గౌడ్, రేవూరి శశిరేఖ, క్రీడా సంయుక్త కార్యదర్శి నలిగంటి శివప్రసాద్, కార్య నిర్వాహక సభ్యులు ఇజ్జగిరి సురేష్, కలకోట్ల నిర్మల జ్యోతి, మర్రి రాజు, మడిపెల్లి మహేందర్, తోట అరుణ తదితర కార్యవర్గ సభ్యులు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ



**ప్రజాపక్షం/లింగాలఘణపూర్:** లింగాల ఘనపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెల్లుట్లలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, స్కేల్స్ జగ్గం ఆనంద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా నెల్లుట్ల గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ గారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించాలంటే క్రమబద్ధమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, పాఠశాలలోని అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తు పాఠశాల గదులలోనే నిర్మితమవుతుందని, కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోతు రవీందర్ మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో మా పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు పొంది ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి దామెర నాగరాజు, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు నర్సింగ రమేష్, మాజీ వార్డ్ మెంబర్స్ యేనగందుల భాస్కర్, జెగ్గం అశోక్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు ఇంజమూరి శ్రీలత, కుందా జ్యోతి, పార్నంది సుకుమారి, వంటేరు మహిపాల్ రెడ్డి, గూడూరు అనిత, జవ్వారపు మల్లేశ్, జాటోతు గోర్సింగ్, దొంతుల కమలాకర్, సర్గం ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో విజ్‌మనీ నూతన శాఖ ప్రారంభం




**ప్రజాపక్షం/జనగామ :** జనగామ పట్టణంలోని విజ్‌మనీ నూతన శాఖను గురువారం జోమిల్యాక్ జెవియర్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, జోనల్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్‌మనీ సేవలు దేశంలో రోజురోజుకు విస్తరిస్తున్నామని, దేశంలో 336 బ్రాంచీ కాగా తెలంగాణలో 35 బ్రాంచీగా జనగామలో ప్రారంభించడం జరిగిందన్నారు. దీని ద్వారా జనగామ ప్రాంత ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాల ఆర్థిక సేవలు అందుబాటులోకి రానున్నాయని, కస్టమర్ల సంతృప్తి కోసం పారదర్శకత లక్ష్యంగా విజ్‌మనీ సేవల్ని విస్తరింపజేస్తుందన్నారు. ఈ శాఖ ద్వారేఆ విదేశీ కరెన్సీ మార్పిడి, విదేశాలకు డబ్బులు పంపిచే సౌకర్యం, ఫారెక్స్ ట్రావెల్ కార్డ సేవలు, విమాన టికెట్ బుకింగ్, హాలిడే ఫ్యాకేజీలు, తక్కువ వడ్డీలో గోల్డ్ లోన్ వంటి సేవలు అందనున్నాయన్నారు. సంస్థల పలు సామాజిక కార్యక్రమాలు సైతం నిర్వయించనుందని, జనగామ పట్టణంలోని రాజీవ్ నగర్ పాఠశాలను దత్తత తీసుకొని పాటశాల విద్యార్దులు బ్యాగ్‌లు, బుక్స్‌తో పాటు వాటర్ ప్యూరిపై వంటివి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్ రాజేంద్రప్రసాద్, రవి, బ్రాంచ్ మేనేజర్ పందిర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీ స్టాల్, విజయ డైరీ స్టాల్ తొలగింపుపై వివాదం

**ప్రజాపక్షం /జనగామ :** జనగామ కలెక్టరేట్ ఎదురుగా ఏర్పాటు చేసిన వనిత టీ స్టాల్, విజయ డైరీ స్టాల్ తొలగింపు యత్నంపై వివాదం నెలకొంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తొలగించేందుకు అధికారులు యత్నించగా టీ, విజయ డైరీ నిర్వాహకులతో పాటు స్థానికులు అడ్డుకున్నారు. బుధవారం తొలగించేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకోవడంతో నిలిపివేశారు. గురువారం ఎకంగా జెసిపిల సహాయంలో తరలించేందుకు యత్నించగా షాపు నిర్వాహకులతో పాటు స్థానిక కౌన్సిలర్, సిపిఎం నాయకలు అడ్డుకొని నిరసన తెలిపారు. కోటీ మంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేస్తామని ప్రభుత్వం వనిత టీ స్టాల్స్‌తో పాటు వివిధ రకాల వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. దీనికి ప్రభుత్వం నుండే డ్వాక్రా గ్రూపులను ఎంపిక చేసి బ్యాంక్ రుణాలు ఇవ్వడం జరిగిందని, వారు ఇచ్చిన ఆర్థిక సహాయంలో షాపులు నిర్వయిస్తుండగా స్థానిక కలెక్టర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్నాయనే నెపంతో తొలగించేందుకు యత్నించడం సరియైంది కాదన్నారు. గత కలెక్టర్ ప్రారంభిస్తే ప్రస్తుత కలెక్టర్ తొలగించడం ఏంటని ప్రశ్నించారు. పేదలు, అడ్డడుగు వర్గాల వారు ఉపాధి కోసం ఇలాంటి షాపులు ఏర్పాటు చేసుకున్నారని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తహాశీల్దార్, రెవెన్యూ కార్యాలయాల్లోనూ ఈ షాపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వనిత టీ స్టాల్, విజయడైరి పాల ఉత్పత్తులు విక్రహించే షాపులను తొలగించడం సరియైంది కాదని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ ఇతర సమస్యలపై దృష్టి పెట్టాల్సింది పోయి పేదలు ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న షాపులను తొలగించే ప్రయత్నం చేయడం సరియైంది కాదని మండిపడ్డారు. నిరసన తెలిపిన వారిలో బూడిద గోపి, మంగళంపల్లి రాజు, ఎండి అజార్డున్, సమ్మద్, బొట్ల శ్రావన్, పాలమాకుల కనకయ్య, పొత్కనూరి సోమయ్య ఉన్నారు.

## సాల్వాపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సాల్వాపూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ మిద్దెల శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేర్యాల, సిద్దిపేట ఆధ్య ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. డా. మాధవి, డా. బాలకిషన్ బృందం మొత్తం 43 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణి చేశారు. అనంతరం సర్పంచ్ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ఉద్దేశమని అన్నారు. ఈ శిబిరం విజయవంతానికి సహకరించిన గ్రామ పెద్దలకు, ఆధ్య హాస్పిటల్ సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అధికారులను సన్మానించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సిరెడ్డి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, సంస్థ వ్యవస్థాపకురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి హాజరై ఎంఈవో కళావతిని సన్మానించడం జరిగింది. అదేవిధంగా మండలంలోని మాధాపూర్ ప్రాథమిక పాఠశాల హెచెం నల్ల లలితను కూడా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెటా సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పడమటి కేశవాపూర్‌లో తీరిన తాగునీటి కష్టాలు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గ్రామస్థుల తాగునీటి ఇబ్బందులను శాశ్వతంగా తొలగించడమే తమ లక్ష్యమని పడమటి కేశవాపూర్ సర్పంచ్ ఎర్రోల్ల విజయ సోములు అన్నారు. మండలంలోని పడమటి కేశవాపూర్‌లో గత కొంతకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో పరిష్కారం లభించింది. రెండు రోజులకు ఒకసారి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటిని ఇకపై ప్రతి రోజు గల్లీకి అందించేలా పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టారు. గేట్‌వాల్స్ ద్వారా నీటి వృధాను అరికట్టడంతో పాటు గ్రామంలో సమానంగా నీరు అందేలా పర్యవేక్షిస్తారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి యుద్ధ ప్రాతిపధికన పనులు పూర్తి చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేముల మహాదేవ్, కిషన్, సత్తయ్య, రమేష్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైనదని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సోమేశ్వర కళ్యాణ మండపంలో వేట ఫౌండర్, చైర్మన్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమెన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు.వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. భవిష్యత్తులో కూడా మహిళల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ లావుడియ మంజుల, రాపాక సరస్వతి, మణెమ్మ, నియోజకవర్గంలోని మహిళలు, వేట సభ్యులు తదితరులు భారీగా పాల్గొన్నారు.

## అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని మండలంలోని దర్దేపల్లి ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ కిట్‌లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వెంకటేశం, డి సూర్య ప్రకాశ్, ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి రాకేష్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, శ్రీనివాస్ ఝాన్సిరెడ్డి, పాపయ్య, ఉప్పలయ్య, వెంకట్, రజిత, రవీందర్, నాగజ్యోతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లాలో పశువులను గాలికుంటు వైరస్ వ్యాధి నుంచి రక్షించేందుకు ప్రతి రైతు తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.గురువారం హనుమకొండ జిల్లా వడ్డేపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ వైరస్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు 2019 నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువులకు టీకాలు వేయడం జరుగుతోందన్నారు. అన్ని పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు.రైతులు తమ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాలు అధికంగా రావాలనే ఉద్దేశంతో తెలియని ఇంజెక్షన్లు ఇవ్వకుండా జాగ్రత్తపడాలని సూచించారు. స్వచ్ఛమైన పాలను ఉత్పత్తి చేసేలా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు గోడపత్రికలు మరియు కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు, వడ్డేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఇతర పశువైద్య సిబ్బంది, రైతులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వారం సంతను ప్రారంభించిన సర్పంచ్ కర్రె లక్ష్మి

ప్రజాపక్షం/ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామం లో వారం సంత (అంగడి) రిబ్బన్ కట్ చేసి సంతను సర్పంచ్ కర్రె లక్ష్మి, ఉప సర్పంచ్ మారుపాక సందీప్, వార్డ్ సభ్యులు, పంచాయతీ సెక్రటరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన గ్రామంలో వారం సంత నడవడం చాలా సంతోషకరం. అంతేకాకుండా మన గోపాల్ పూర్ గ్రామంలో వారం సంత విజయవంతంగా ఎప్పటికీ కొనసాగాలంటే, మన గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. మన గ్రామానికి దగ్గరన కొన్ని గ్రామాలు ఉన్నాయని, మన గ్రామం ఈ గ్రామాలకు దగ్గర ఉండడం వలన మన గ్రామానికి ఎక్కువ ప్రజలు వచ్చి కూరగాయలు కొనుక్కొని పోవడానికి ఆసక్తి చూపుతారు అని అన్నారు. మన గ్రామం వారం సంత నడుస్తుంది అని ప్రతి గ్రామానికి తెలియజేయడంలో ప్రతి ఒక్కరు భాగస్తులు కావాలని ప్రారంభం రోజే విజయవంతంగా వారం సంత నడవడం చాలా సంతోషకరమని అన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

ప్రజాపక్షం/కొడకండ్ల: మండలం చెరువు ముందు తండాలో గురువారం జరిగిన వివాహ వేడుకలకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కొడకండ్ల మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ అన్నకుమార్తె సంగీత వివాహం చందులాల్‌తో జరుగగా సురేష్ నాయక్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తగాదా భూములపై కన్నేసిన ప్రభుత్వ ఉద్యోగి

ప్రజాపక్షం/గోవిందరావుపేట: అడుగుపెడితే అంతా నాదే చేసేది ప్రభుత్వ ఉద్యోగం సంపాదించేది కోట్లలో వ్యాపారం ఇది మండలంలోని ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉదాంతం మండలంలో జిల్లాలో ఇతర జిల్లాలో పట్టణాలలో ఎక్కడైనా సరే వివాదాస్పద భూములు ఉంటే చాలు అది వినబడితే చాలు ఈ ప్రభుత్వ ఉద్యోగి అక్కడ ఎంటర్ అయిపోతాడు తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని సమస్యను సాల్వ్ చేస్తానని కమిషన్ను మాట్లాడుకోవడం లేదా ఖరీదు చేయడం దానిని తన డబ్బు రాజకీయ పలుకుబడి సామాజిక వర్గం సపోర్టుతో సాధించి కోట్లకు పడగలెత్తాడు చేసే ఉద్యోగానికి సైతం సరిగా హాజరు కాకుండా ఉన్నతాధికారులను మేనేజ్ చేయడం ఇతనికి వెన్నతో పెట్టిన విద్య కుటుంబ సభ్యుల మధ్య పంచాయతీలతో ముడిపడిన ఆస్తులపై ఇతడి కన్ను ఎప్పుడూ ఉంటుంది ఆర్థికి పావు చేరుగా అడిగి ముందు తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని తన పలుకుబడితో చక్రం తిప్పి డబ్బు సంపాదించడం ఇతని ఆనవాయతీ పనికిరాని భూములను కొనడం వాటికి రకరకల మరమ్మత్తులు చేయడం రియల్ ఎస్టేట్ పేరుతో అమ్మడం తాను బిల్డర్ నంటూ అతి తక్కువలో భవనాలను నిర్మిస్తానని ముందు మాట్లాడుకుని ఒప్పందం చేసుకోవడం ఎదుటి వ్యక్తి ఆర్థిక ఇతర కుటుంబ వ్యవహారాలను ఆసరా చేసుకొని సొమ్ము చేసుకోవడం ఇతని హాబీ ఇప్పటివరకు మండల వ్యాప్తంగా ఆ ఉద్యోగి నిర్మించిన అంతస్తులన్నీ వివాదాస్పదంగానే ముగిశాయి కట్టించుకున్న వాళ్లే తప్పయింది అంటూ కాంప్రమైజ్ అయ్యారు తప్ప తన ఆర్థిక లాభాలను వదులుకోకుండా సాధించాడు అంతే కాదు కాంట్రాక్టర్ను అంటూ ఇతరుల పేరు మీద నుండి బినామీ కాంట్రాక్టర్గా చేస్తూ అధికారులకు అధిక పర్సంటేజీలు ఇస్తూ నాణ్యత లోపాలతో పనులు చేసి కోట్లు ఆర్జించిన ఘనత సాధించారు వారసుడు కాకపోయిన లేకపోయినా యాజమాన్యానికి అధికారులకు మా ములు ఇచ్చి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకుని ఇతరులకు అమ్మి ఆస్తులు కూడా పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయిని ఎవరి పాపము శాపము తగిలి రోగాలతో బాధపడుతున్న సంపాదనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆ వ్యక్తి మండలంలో ఒక ప్రముఖ వ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఏదో ఒక రోజు పాపం పండుద్ది ఎవరిది ఒక శాపం తగులుద్ది అని బాధితులు మొత్తుకుంటున్నారు లెక్క చేయకపోవడం అతని కుషాగ్రబుద్ధికి నిదర్శనంగా స్థానికులు పేర్కొంటున్నారు.

## చైతన్యం ద్వారానే వినియోగదారుల మోసాలను అరికట్టవచ్చు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ రచించిన వినియోగదారుల హక్కుల చైతన్య కరపత్రికను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆవిష్కరిస్తూ, రతన్ సింగ్ ఠాగూర్ గత 40 సంవత్సరాలుగా వినియోగ దారుల హక్కుల కోసం ఎన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈనాటి ఈ కరపత్రంల్లో ,వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2009 వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం మోస మోసపూరిత ప్రకటనలు (ఇందులో పాల్గొన్న సెలబ్రిటీలపై జరిమానా, జైలు శిక్ష తదితరాంశాలు) హానికరమైన కల్తీలు ,ఆన్లైన్ విక్రయాలు మరియు మోసాలను వినియోదారులు ఈ చట్టం ద్వారా తమకు తాము ఎలా కాపాడుకోవాలో సవివరంగా ఈ కరపత్రంలో రూపొందించడం జరిగిందని తెలిపారు. మీరు ఈ 78 సంవత్సరాల వయసులో కూడా సమాజ చైతన్యవంతమైన కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందిస్తున్నానని ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టంపై అహ్వాన కలిగి మిమ్ములను మీరు రక్షించుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి, శ్రీనివాస రావు, కాళిదాస్, కన్స్యూమర్ ఆక్టివిటీస్ డాక్టర్ జగదీష్ ప్రసాద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యత అప్పగించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు



ప్రజాపక్షం/గూడూరు: ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ సంస్థ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పడిగే నాగేశ్వరరావు దొరను ఎన్నుకున్నారు. మేడారంలోని సమ్మక్క సారలమ్మ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో జాతీయ మరియు రాష్ట్ర కమిటిల పున ర్వ్యవస్థీకరణ జరిగింది.ఈ సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు ఈసం సుధాకర్ అధ్యక్షతన చర్చలు నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పడిగే నాగేశ్వరరావు దొరను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీ నారాయణ సమావేశంలో పాల్గొని సంస్థ భవిష్యత్ కార్యాచరణపై మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు దొర మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ భాధ్యత అప్పగించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసి హక్కుల పరిరక్షణ వారి భూమి అరణ్య హక్కులు జీవనోపాధి సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. ఆదివాసి ప్రజల అభివృద్ధి సంక్షేమ కోసం సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా వన్నాల వెంకటరమణ



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డాక్టర్ వన్నాల వెంకటరమణ నియామకం అయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం ఈనెల 12 నుండి అమలులోకి వస్తుందని ప్రకటించారు. గతంలో డాక్టర్ వన్నాల వెంకటరమణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. కాగా, తన సేవలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనకు బాధ్యతను అప్పగించినందుకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావుకు, రాష్ట్ర నాయకులకు, జాతీయ బీజేపీ నాయకత్వానికి వెంకటరమణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ వన్నాల వెంకట రమణ బాల్యం నుండి స్వయంసేవక్, గురుకుల విద్యాలయం, మహేశ్వరం, నర్సంపేటలో 5వ తరగతి నుండి ఇంటర్ వరకు విద్యనభ్యసించినారు. తన 9 10 వ తరగతి లో ముఖ్య శిష్యక్ గా, హై స్కూల్ రోజుల్లో వర్గాల్లో ఆర్ఎస్ఎస్ శిబిరాలకు హాజరయ్యేవారు. వెంకటరమణ తండ్రి మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ మాజీ జాతీయ కౌన్సిల్ మెంబర్ గా ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావును కలసి డాక్టర్ వన్నాల వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికార ప్రతినిధిగా నియమించినందులకు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావును కలసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ

ప్రజాపక్షం/గోవిందరావుపేట: మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ పదోతరగతి విద్యార్థులకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య ద్వారా గురువారం స్టడీ చైర్స్ పంపిణీ చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ అన్నారు ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల చదువు కోసం ఒక ఇంత సాయం చేయాలన్న దృక్పథంతో సూర్య స్పందించి స్టడీ చైర్స్ అందించడం జరిగిందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ముందు ముందు సూర్య ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెంకటకృష్ణ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింత క్రాంతి గొంది కిరణ్ జక్కు రణదీప్ గౌడ్ యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ మురళి నాయక్ సహకారంతో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం క్రింద నిర్మించిన నూతన సీసీ రోడ్డును పనులు గురువారం ప్రారంభించారు. గూడూరు సర్పంచ్ గాబాధ్యతలు తీసుకున్న తరువాత తక్కువ కాలంలోనే గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి గూడూరు గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.సర్పంచ్గా సునీత కోమ్మాలునాయక్ మాట్లాడుతూ గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఎన్నికల ముందు ఇచ్చిన అభివృద్ధి పనులను పూర్తిచేసి చూపిస్తానని అన్నారు, ఇచ్చిన మాట కంటే ఎక్కువ అభివృద్ధి చేసి మాట నిలబెట్టుకుంటానని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## 15 నుండి ఒంటిపూట బడులు

కేసముద్రం/ప్రజాపక్షం: మార్చి 15 నుండి ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర యాజమాన్య పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఒంటి పూట తరగతులు నిర్వహించాలని మండల విద్యాధికారి కాలేరు యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం జి.ఓ జారీ చేసిందని, ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని తెలిపారు. మార్చి 14 నుండి 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని, 10వ తరగతి వార్షిక పరీక్షా కేంద్రాలలో మధ్యాహ్నం 1:00 గంIIల నుండి సాయంత్రం 5:00 గంIIల వరకు పరీక్షలు ఉన్న రోజుల్లో ఒంటి పూట తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులకు తప్పనిసరిగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు.

## స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపిక పరీక్ష..

ప్రజాపక్షం/నర్సింహులపేట: స్పోర్ట్స్ స్కూళ్ల ఎంపిక ప్రవేశ పరీక్ష మండల కేంద్రంలోని హైస్కూల్లో నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో బి.రామ్మోహన్ రావు తెలిపారు.202627 విద్యా సంవత్సరానికి సంబంధించి హకీంపేట,కరీంనగర్,ఆదిలాబాద్,హన్మకొండ ప్రాంతాలలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్లో 4వ తరగతి ప్రవేశాల కొరకు ఎంపికలు జరుగుతాయని తెలియజేశారు.ఆసక్తి గల స్టూడెంట్లు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఎంపిక ప్రవేశ పరీక్ష ఈ నెల 13న9 గంటలకు మండల కేంద్రంలోని హైస్కూల్లో జరుగుతాయని స్టూడెంట్ల పేరెంట్స్ తో కలిసి వచ్చి రిపోర్టు చేయాలని సూచించారు.

## ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ల బహూకరణ

ప్రజాపక్షం/కొడకండ్ల: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలకు ఇన్ఫోసిస్ ప్రతినిధులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రెండు కంప్యూటర్లను అందించడం జరిగింది. అనంతరం సంస్థ ప్రతినిధులు స్వాతి నాగరాజు, కేపీ రావు మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న పాఠశాలల్లో డిజిటలీకరణ ఆన్‌లైన్ క్లాసులకు ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను విద్యార్థుల సందర్శనకు సహకారం అందించినందుకు వారికి ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల పనుల కోసం నిధులు మంజూరు

**ప్రజాపక్షం/ హత్నూర :** నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని హత్నూర మండలానికి ఎస్ఆర్ ఈజీ ఎస్ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణం కోసం కోటి 25 లక్షల రూపాలయల నిదులు మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారులోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. మండలానికి సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిదులు మంజూరు చేయించిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి కి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సొసైటీని సందర్శించిన.. కామర్స్ డిగ్రీ విద్యార్థులు

**ప్రజాపక్షం/పాపన్నపేటః** విద్యార్థులు పుస్తకాలను నేర్చుకునే సిద్ధాంత జ్ఞానంతో పాటు ప్రయోగిక అవగాహన కొరకు సొసైటీలను సందర్శించామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగాధిపతి డాక్టర్ శరత్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తపల్లి సహకార సంఘాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలు చేసి విద్యాపరమైన అంశాలను అబ్జర్వ్ చేశారు. సంఘాల నిర్మాణ విధానం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, రైతుల అందించే సేవలు, తక్కువ వడ్డీపై రుణాలు, ఎరువులు, విత్తనాలు, వంటి అంశాలపై సొసైటీ అధికారులు అవగాహన కల్పించారు. డిసిఓ కరుణాకర్, స్పెషల్ ఆఫీసర్ శంకర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, హరిత, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండల పరిధిలోని శ్రీ కొండపోచమ్మ దేవాలయం హుండీని గురువారం దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈఒ రవికుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు హుండీలో సమర్పించిన నగదును లెక్కించగా రూ. 14లక్షల 19 వేల 800 నగదుతో పాటు కొంత బంగారు, వెండి వస్తువులు సమర్పించినట్లు ఇఒ రవికుమార్ తెలిపారు. అమ్మవారికి హుండీ ద్వారా వచ్చిన నగదుతో పాటు బంగారం, వెండి వస్తువులను బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## హైదరాబాద్ తరలి.. వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/బెజ్జంకి :** హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ చైర్మన్‌గా మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ పదవీ స్వీకార మహోత్సవానికి గురువారం మండల కేంద్రం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,పార్టీ మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణ, పార్టీ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందజేస్తాం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోమారం గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతులమీదుగా ప్రత్యేక పూజలు చేశారు. గోమారం గ్రామానికి చెందిన గొల్ల కల్యాణి, కుక్కల రేణుక నూతన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో నిరుపేదలకు ఎలాంటి ఇండ్లు మంజూరు కాలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. గోమారం గ్రామానికి 45 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రజాపాలనలో భాగంగా అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, గోమారం సర్పంచ్ హైమావతి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్‌గుప్తా, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బుర్ర మురళీగౌడ్, ఉపసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, దొంతిరెడ్డి అరుణారెడ్డి, పాంబండ సర్పంచ్ నాయిని సమతవేణు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కాముని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర మీడియా ప్యానలిస్టుగా డాక్టర్ సురేష్ గౌడ్



**ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట :** బిజెపి పార్టీ సిద్ధాంతాలు, కేంద్రప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలకు మీడియా ద్వారా మరింత సమర్ధవంతంగా చేరవేయడానికి తనవంతు కృషి చేస్తానని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బిజెపి రాష్ట్ర మీడియా ప్యానలిస్టు డాక్టర్ బొంగొని సురేష్ గౌడ్ తెలిపారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం తనను " బిజెపి రాష్ట్ర మీడియా ప్యానలిస్టుగా నియమించడంపట్ల ఎంతో సంతోషంగా మరియు గౌరవంగా భావిస్తున్నట్లు డాక్టర్ బొంగొని సురేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సురేష్ గౌడ్ మాట్లాడుతూ..తెలంగాణలో బిజెపి పార్టీ బలోపేతం కోసం, ప్రజల సమ్యలను సమాజం ముందుకు తీసుకురావడంలో మరియు బిజెపి పార్టీ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడంలో తన బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ అవకాశం ఇచ్చినపార్టీ రాష్ట్ర నాయకత్వానికి డాక్టర్ బొంగొని సురేష్ గౌడ్ కృతజ్ఞతలను తెలిపారు.

# స్వచ్ఛంద సేవకులుగా ఎదగాలి

### విద్యార్థులకు జిల్లా అగ్నిమాపకశాఖాధికారి పిలుపు



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు :** గొప్ప స్వచ్ఛంద సేవకులుగా ఎదగాలని గీతం విద్యార్థులకు జిల్లా అగ్ని మాపకశాఖాధికారి పిలుపు నిచ్చారు. ఏదైనా అనుకోని విపత్తులు సంభవించినప్పుడు స్వీయ రక్షణతోపాటు తోటి పౌరులను రక్షించడం కోసం వారం రోజుల శిక్షణ తరగతులను గీతం విద్యార్థులకు అందజేస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకుని గొప్ప స్వచ్ఛంద సేవకులుగా ఎదగాలని సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి. నాగేశ్వరావు పిలుపు నిచ్చారు. తెలంగాణ అగ్ని మాపక విపత్తు స్పందన అత్యవసర ,పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పౌర రక్షణ స్వచ్ఛంద శిక్షణ సామర్థ్య నిర్మాణం కార్యక్రమాన్ని గురువారం హైదరాబాదులోని గీతం డిమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. దీనిని కేంద్ర, రాష్ట్ర ,ప్రభుత్వ శాఖల సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివీవీ ఎస్ఆర్ వర్మ తోకలిసి నాగేశ్వరావు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులను (విద్యార్థులకు) అగ్ని ప్రమాదాలు ,విమాన,రసాయన అణు విస్ఫోటనం, వరదలు, భవన సముదాయాలు , కూలిపోవడం, రోడ్డు ప్రమాదాలు ,భూకంపాలు ,ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణమే ఏలా ప్రతిస్పందించాలి అనే దానిపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే వైద్య సిబ్బంది సహకారంతో క్షతగ్రాతులను ప్రథమ చికిత్స తో పాటు సీపీఆర్ ప్రక్రియ స్ట్రెచ్చర్లపై తరలింపు వంటి వాటిపై కూడా తర్ఫీదు ఇస్తున్నారు. వీటితో పాటు జన సమూహాన్ని అదుపు చేయడం విపత్తు సమయంలో ప్రజలకు ఔషధాలు, ఆహార పంపిణీ వంటి వాటిపై కూడా శిక్షణ ఉంటుంది. ఈ కార్యక్రమం వారం రోజుల పాటు ( ఈ నెల 18వ తేది వరకు) కొనసాగనుంది. ఈ శిక్షణ భాగంగా తొలిరోజు పటాన్‌చెరు అగ్నిమాపక శాఖాధికారి కె. వి నాగేంద్ర విద్యార్థులకు అగ్ని మాపక పరికరాల వినియోగం అనుకోకుండా ఏదైనా మంటలు చెలరేగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో సంగారెడ్డి అగ్ని మాపకాధికారి ఎస్. భిక్షపతి, ఇతర అధికారులు ,పలువురు. సిబ్బంది గీతం స్కూల్ ఆప్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ అధ్యాపకులు ప్రోపెసర్ కె. మంజునాథ్ చారి, డాక్టర్ పాత్రుడు, ఎస్టేట్ అధికారులు డిపిఏ మోహన్ , ఎం సతీష్, భద్రాతాధికారి కె. సంతోష్ కుమార్, యాదవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నాగులపల్లి గ్రామ సర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్ అన్నారు. నాగులపల్లి స ర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్ జన్మదిన సందర్భంగా, నాగులపల్లి పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు సర్పంచ్ సుమతి శివకుమార్ ఆధ్వర్యంలో పరీక్షల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి నాగులపల్లి గ్రామానికి, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడిపై దాడి..



**ప్రజాపక్షం/శివ్వంపేట :** బిఆర్ఎస్ నాయకుడిపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల దాడి ఘటన శివ్వంపేట మండలంలో చర్చనీయాంశమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భర్త ఆకుల శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా ఉన్నారు. అయితే ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీకి సపోర్టు చేయలేదని కక్ష్యతో తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఆకుల శ్రీనివాస్‌పై కొంతాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటరాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, కలకంటి వెంకటేష్ అనే ముగ్గురు కలసి దాడి చేసినట్టు పేర్కొన్నాడు. ఆ సమయంలో తన మెడలో ఉన్న తువాలను మెడకు బిగించి కాంగ్రెస్ పార్టీలో చేరాలని బెదిరింపులకు పాల్పడమే కాకుండా తన కారును సైతం ఎత్తుకెళ్లారని పేర్కొనాడు. అధికారంలో ఉన్నామని అహంతో దౌర్జన్యాలకు దిగడంపై తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. దాడి చేసిన వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజలు జాగ్రత్తలు వహించాలి

### ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మహేందర్




**ప్రజాపక్షం/మద్దూరు :** ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో జాగ్రత్తగా మెలిగినప్పుడే వ్యాదులను కట్టడికి కృషిచేసినట్లు అని మద్దూరు మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చిలుముల మహేందర్ అన్నరు. అలాగే ప్రజలు వైద్య సిబ్బంది సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ, సహకరించాలని డాక్టర్ మహేందర్ తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 133 మందికి వివిధ రకాలైన వైద్య పరీక్షలను వైద్య నిపుణులు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో స్త్రీలకు సంబంధించిన డాక్టర్లతో పాటుగా, ఎముకల (ఆర్థోపెడిక్), చిన్నపిల్లల, దంత వైద్య (డెంటల్) నిపుణులు, కంటి సంబంధిత డాక్టర్లలతో పాటుగా జనరల్ మెడిసిన్ డాక్టర్లు పాల్గొని వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ , వైద్య సిబ్బంది , ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## విబి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి

### సిపిఐ(ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/కొండాపూర్ :** కొండాపూర్ మండలంలోని తేర్పోల్ గ్రామంలో సిపిఐ(ఎం) పార్టీ బృందం ఉపాధి కూలీలతో కలసి గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యుడు అతిమేలా మాణిక్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విబి జి రామ్ జి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ. 800 కూలీ ఇవ్వడంతో పాటు ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని కోరారు. అలాగే ఉపాధి పనుల్లో అమలు చేస్తున్న ఫోటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో తాగునీరు. మెడికల్‌కిట్లు, భద్రతా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి 16న కొండాపూర్ ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగే ఉపాధి కూలీల ధర్నాలో ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండాపూర్ మండల కార్యదర్శి రాజయ్య, కమిటీ సభ్యులు బాబురావు, వెంకటేశం, వినోద్, రాజు , అర్జున్, అనిల్ , తదితరులు పాల్గొన్నారు.

